





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 342 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | బుధవారం 12 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :342 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | WED 12 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి



- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా

- మిగతా 2లో



## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

### వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి

- మిగతా 2లో

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

## సీఎం చంద్రబాబు పిలుపు

- 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
- జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
- ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- మిగతా 2లో



## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

### నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న రోజా
- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి హితవు

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి

- మిగతా 2లో

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

### పాలకొల్లు సభలో జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు నిప్పులు

- ఆక్వారంగానికి రూ. 1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ జీవోను విడుదల చేసిన అచ్చెన్న
- ఆక్వారంగం చంద్రబాబు మానసపుత్రిక అని వ్యాఖ్య
- జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో





## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

- ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు
- ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపిన పోలీసులు
- ప్రయాణికులు కొత్త మార్గాలను అనుసరించాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం



పెన్ పవర్ డెస్క్:అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది.

- మిగతా 2లో

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు:

### బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక



- ఏఐపై అర్థవంతమైన మానవ పర్యవేక్షణ ఉండాలని సూచన
- 'అల్గారిథమ్ నిర్ణయించింది' అనే సమాధానం ఆమోదయోగ్యం కాదన్న ఆర్బీఐ
- రుణాలు, కస్టమర్ సేవలో ఏఐ ఎంతో ఉపయోగకరమని వెల్లడి
- ఏఐతో జరిగే మోసాలను ఎదుర్కోవడానికీ ఏఐయే అవసరమని వ్యాఖ్య

- మిగతా 2లో

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

- మిగతా 2లో





## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## జమిలి ఎన్నికలకు బ్రేక్ పడినట్లేనా?.. తెలుగు రాష్ట్రాలలో సీట్ల పెంపు లేనట్లేనా?

2029 లో జమిలి ఎన్నికలకు సంబంధించి కొంత సందిగ్ధత నెలకొంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుదల కూడా కష్టమేనని అనిపిస్తుంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరును చూస్తుంటే ప్రస్తుతం ఉభయ సభల్లో డీలిమిటేషన్ కు సంబంధించిన బిల్లులు ఆమోదం పొందే అవకాశాలు లేవు. ఇప్పటికే ఒకసారి వీగిపోయిన డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు మరోసారి ఉభయ సభల ముందుకు తెచ్చి ఆమోదం పొందుదామని కేంద్ర ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా వీలు కుదరడం లేదు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అనేది కూడా జరిగేది కష్టంగానే కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆలోచనలకు విపక్షాలు అడ్డుకట్ట వేస్తుండటంతో ఈ దఫా రెండు తెలుగు రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుదలపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బొద్దింకల ఉద్యమంతో...**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగ జెన్ జీల ఉద్యమం తర్వాత రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ డీలిమిటేషన్ కు మద్దతిచ్చిన విపక్షాల్లోని డీఎంకే వంటివి కూడా ఇప్పుడు వెనక్కుతగ్గాయి.దీంతో వన్ నేషన్ వన్ ఎలక్షన్, డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ల అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నట్లుంది. జమిలి ఎన్నికలకు రాజ్యాంగ, న్యాయ, సవరణలు అవసరం. ఈ అడ్డంకులను అధికమించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉభయ సభల్లో మేజార్టీ కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా అది బెడిసి కొడుతుంది. వర్షాకాలం పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ బిల్లులను తేవాలని ఆలోచించిన ప్రభుత్వం చివరి నిమిషంలో విరమించుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ను చీల్చి ఎంపీలను తమ వైపునకు తిప్పుకున్నా అనుకున్న మెజారిటీ మాత్రం రాలేదు.

**మెజారిటీ లేకపోవడంతో...**

లోక్ సభలో ఎన్డీయేకు తగిన మేజార్టీ ఉన్నప్పటికీ రాజ్యసభలో లేదు, ప్రతిపక్ష ఇండి కూటిమికి బలం ఉంది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగ సవరణ బిల్లులు లోక్‌సభలో ఆమోదం పొందిన రాజ్యసభలో గట్టెక్కే పరిస్థితి లేదు. బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితం ఇవ్వడం లేదు. అన్నీ సాఫీగా జరుగుతున్న సమయంలో బీజేపీపై బొద్దింకలు వచ్చి పడ్డాయి.రాష్ట్ర విభజన తర్వాత తెలుగు రాష్ట్రాలు తమ అసెంబ్లీ స్థానాలను పెంచుకోవచ్చు. విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం, ఏపీ అసెంబ్లీ స్థానాలు 175 నుండి 225కి, తెలంగాణ స్థానాలు 119 నుండి 153కి పెరగాలి కానీ దానిని కేంద్రం అమలు చేయలేదు.తమకు అవసరమైన జమ్మూ కాశ్మీర్ వంటి చోట్ల అసెంబ్లీ స్థానాలను బీజేపీ పెంచింది కానీ, తెలుగు రాష్ట్రాల్లో పెంచడం లేదు. దీంతో ఈ సారి కూడా ఏపీ, తెలంగాణలో సీట్ల పెంపుదల కష్టమేనని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

- మొదటి పేజి తరువాయి

విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు.నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ఘ్యా×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది.

ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని

సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- మొదటి పేజి తరువాయి

ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు.భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు.

ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు.పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు: బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక

కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు.ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు.కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాల ను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో, మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పుల పట్ల బ్యాంకు లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతిక తను ఆయుధంగా వినియోగించుకోవాలని వ్యాఖ్యానించారు.

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెంటిలేటర్‌పై పడేసిన వాళ్లకు, తాడేపల్లి ప్యాలెస్ దాటని మాజీ సీఎం జగన్‌కు ఆక్వా రైతుల కష్టాల గురించి మాట్లాడే హక్కే లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఊపిరి పోస్తూ రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన జీవోను మంత్రి విడుదల చేశారు.పాలకొల్లులో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజులతో కలిసి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆక్వారంగం అనేది సీఎం చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని అభివర్ణించిన ఆయన, ఐదు కోట్ల ఆంధ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం వల్లనే చంద్రబాబు వంటి దార్శనిక నేత దక్కారని కొనియాడారు. 2019లో ప్రజలు ఆవేశపడి దోపిడీదారులకు అధికారం కట్టబెట్టడం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లపాటు తీవ్ర ఐసీయూ స్థితిలోకి వెళ్లిందని, నాటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు జగన్ ప్రతి చిన్న విషయాన్నీ సమస్యగా చిత్రీకరించే చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఎంతటి నిధుల కొరత ఉన్నప్పటికీ ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఏకైక సంకల్పంతో ఈ భారీ విద్యుత్ సబ్సిడీని సకాలంలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీతో పాటు, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ఈ 26 నెలల స్వల్ప వ్యవధిలోనే నెరవేర్చామని గర్వంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ సాయంతో ఏపీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మారుస్తూ 'బ్లూ ఎకానమీ' దిశగా ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు.ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు.

ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## నకిలీ పోలీసులతో ర్యాలీలా? వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- మొదటి పేజి తరువాయి

దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు.పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే.. నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- మొదటి పేజి తరువాయి

, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు.నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్-వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు.నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్-వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది.కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరపున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది.మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

# వెలిగొండ ప్రాజెక్ట్ తుది దశకు.. ఈ నెల 22న ట్రయల్ రన్



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**

జిల్లా ప్రజలు, రైతులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ నెల 22న వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా నల్లమల సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేసేందుకు ట్రయల్ రన్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని ఆయన తెలిపారు. ఇది ప్రాజెక్ట్ పురోగతిలో కీలక ఘట్టమని పేర్కొన్నారు.వెలిగొండ ప్రాజెక్ట్ కేవలం సాగునీటి ప్రాజెక్ట్ మాత్రమే కాదని, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల రైతుల కలకు ప్రతీక అని అన్నారు. కరువు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడంతో పాటు ఈ ప్రాంతాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు.ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో ప్రాజెక్ట్ పనులు వేగంగా పూర్తవుతున్నాయని డాక్టర్ ఏలూరి తెలిపారు. ట్రయల్ రన్ విజయవంతమైతే రైతుల పొలాలకు సాగునీరు అందించే లక్ష్యం చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తితో మార్కాపురం జిల్లాకు సాగునీటి భరోసా, ప్రజలకు తాగునీటి భద్రత లభిస్తుందని ఆయన అన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# దేశభక్తి ఉప్పొంగేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ప్రత్యేక కార్యక్రమాలు..

## 15వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను వెల్లడించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**

దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ పి. రాజాబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం అధికారిక వేడుకగానే కాకుండా ప్రజా భాగస్వామ్యంతో ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మన పూర్వీకులు, స్వాతంత్ర్య సమరయోధుల అపార త్యాగాల ఫలితంగానే నేడు మనకు ఈ స్వేచ్ఛ, ఆత్మగౌరవం లభించాయని, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు దేశం సాధించిన మైలురాళ్లను స్మరించుకుంటూ రాబోయే తరాలకు ఈ స్ఫూర్తిని అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. "వికసిత భారత్ – 2047" లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆయన కోరారు. ఐఏఎస్ అధికారులు, వైద్యులు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తల నుండి విద్యార్థుల వరకు ప్రతి ఒక్కరూ తాము దేశాభివృద్ధికి ఏ విధంగా సేవ చేస్తారో వివరిస్తూ స్వచ్ఛందంగా సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, యువత, విద్యార్థులు, పౌర సమాజం మరియు సాధారణ ప్రజలందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ముందస్తు వేడుకలు ఇలా...**

డిజిటల్ వీడియో ప్రచారం "అనే నేను" క్యాంపెయిన్ (ఆగస్టు 10 నుండి 15) ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, పౌరులు "వికసిత భారత్ – 2047" సాధనలో తమ పాత్రను వివరిస్తూ చిన్న వీడియోలను రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పంచుకుంటారు. పాఠశాలల్లో " నేను – నా దేశం" ("అనే నేను") ప్రతిజ్ఞ (ఆగస్టు 10 నుండి 15) ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భవిష్యత్తులో తాము ఏమి కావాలనుకుంటున్నారో, దేశాభివృద్ధికి ఏ విధంగా తోడ్పడతారో స్వీయ ఆలోచనతో ప్రతిజ్ఞ చేస్తారు. అత్యుత్తమ ఆలోచనలను స్వాతంత్ర్య దినోత్సవం రోజున సత్కరిస్తారు. పాఠశాల విద్య, సర్వశిక్షా అభియాన్, ఇంటర్మీడియట్ మరియు కాలేజ్ ఎడ్యుకేషన్ శాఖలు దీనిపై ముఖ్యంగా చర్యలు తీసుకుంటాయి.

**తిరంగా సైకిల్ ర్యాలీలు (ఆగస్టు 12 నుండి 15)..:** కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ సందేశంతో జిల్లాలోని అన్ని మండలాలు, జిల్లా కేంద్రంలో త్రివర్ణ పతాకాలతో తిరంగా సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. ర్యాలీ ముగింపులో ప్రధాన స్థలంలో పౌరులందరితో ప్రతిజ్ఞ చేయిస్తారు.

**హర్ ఘర్ తిరంగా (ఆగస్టు 13 నుండి 15)..:** రాష్ట్రంలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి పాల్గొంటారు. మహనీయుల విగ్రహాలు, సెంటర్లలో జెండాలతో సెల్ఫీలు/వీడియోలు తీసి ' హర్ ఘర్ తిరంగా . కామ్ ' వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేస్తారు. దీనికి మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్, స్వచ్ఛ గ్రామ స్వచ్ఛ వార్డు, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలు సమన్వయం వహిస్తాయి.

**మొక్కల పెంపకం మరియు ప్రతిజ్ఞ – మాస్ ప్లాంటేషన్ (ఆగస్టు 14):** అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే భారీగా మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతుంది. "నా ఆశయం లాగే ఈ మొక్క కూడా ఎదగాలి" అనే భావనతో, నాటిన మొక్కల వద్ద చేతిలో జాతీయ జెండా పట్టుకుని దేశ నిర్మాణం కోసం తమ వంతు కృషి చేస్తామని, మొక్కను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తారు.

**మువ్వన్నెల వెలుగుల కాంతులు – తిరంగా ఇల్యూమినేషన్ (ఆగస్టు 14.. 15)..:** ప్రభుత్వ భవనాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన జంక్షన్లు, ముఖ్యమైన పబ్లిక్ ప్రాంతాలను జాతీయ పతాక రంగుల (త్రివర్ణ) విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా అలంకరిస్తారు.

**సోషల్ మీడియా హ్యాష్‌ట్యాగ్‌లు:** సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వీడియోలు, ఫోటోలకు క్రింది హ్యాష్‌ట్యాగ్‌లను తప్పనిసరిగా జత చేయాలని జిల్లా యంత్రాంగం కోరింది.

# తూకాలు.. మోసాలు.. నామమాత్రంగా దాడులు.!

### తూనికల కొలతల అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు.
### నామమాత్రపు దాడులపై బగ్గు మంటున్న జనం.
### వాళ్లు మనవాళ్లే .. మోసాలు చేసేవారిని కన్నెత్తి చూడని అధికారులు.



**పెన్ పవర్, కంభం ఆగస్టు 11;**

తూకాలు.. మోసాలు.. నామమాత్రంగా దాడులు చేయడం పట్ల తూనికలు అధికారుల తీరుపై తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంభం పట్టణంలో మంగళవారం తూనికల కొలతలు అధికారులు దాడులు నిర్వహించి ఓ ఐరన్ షాపు పెయింట్ షాప్ కొంత ఫైన్ విధించినట్లు వారి పేర్కొన్నారు. అనేకమంది కిరాణా వ్యాపారులు భారీ స్థాయిలో మోసం చేస్తున్నప్పటికీ వారిపై కన్నెత్తి చూడడం లేదు. అలాగే కూరగాయల మార్కెట్ పెట్రోల్ బంకులు రైస్ వ్యాపారుల తో పాటు పలు వ్యాపారాలు గుట్టుగా చేస్తున్నప్పటికీ వారిని విధిగా తనిఖీ చేయాల్సిన అధికారులు మౌనం దాలుస్తున్నారు. నిత్యం మోసాలు జరుగుతున్నా పట్టించుకునే వారు లేరు. అప్పుడప్పుడు తనిఖీలు దాడులు చేసి మిన్నకుంటున్నారే గాని నిత్యం చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. బరువు కొలతలు కల్తీ ప్యాకేజీ తూనికల కొలతల శాఖ కిందికి వస్తాయి. అలాగే ప్రైవేటు గా ఎలాంటి వస్తువులైన ప్యాకింగ్ చేసే నిబంధనలు అతిక్రమిస్తే వాటిపై ఎమ్మార్పీ ధర కంటే అత్యధికంగా అవిక్రయించిన చర్యలు తీసుకోవచ్చు .ప్యాకింగ్ తేదీ పూర్తయ్య గడువు లేకపోయినా వారిని నిలదీయవచ్చు .తయారీ వస్తువుపై కస్టమర్ నెంబర్ ఉండాలి ఇలా ఎన్నో నిబంధనలు ఉన్నాయి. ఏ ఒక్కటి అమలు చేయడం లేదు. ఎలక్ట్రానిక్ ప్లాట్ఫారం కాటాలు సంవత్సరానికి ఒకసారి ముద్ర వేయించుకోవాలి చాలా మంది సీల్ వేసుకోవడం లేదు వాస్తవానికి వినియోగదారులకు అవసరమైన వస్తువులపై దాడులు నిర్వహిస్తే ఎన్నో మోసాలు వెలుగులోకి వస్తాయి .కేవలం సంబంధం లేనివి షాపులు తనిఖీ చేసి వాటిపై కేసులు రాయడంతోనే సరిపెట్టుకోనడం తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా తూనికల కొలతల అధికారులు వ్యాపార సంస్థలపై దృష్టి పెట్టి విధిగా తనిఖీలు చేయాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అందినకాడికి... దోచుడే..!

### ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలు – సామాన్యుడి జేబుకు చిల్లు
### అవసరం లేని టెస్టులు.. ఫీజుల పేరుతో దోపిడీ
### వైద్యం కాదు వ్యాపారం చేస్తున్న ఆసుపత్రులు
### రోగుల జేబులు కాళీ చేస్తున్న ప్రైవేట్ వైద్యం
### పట్టించుకోని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు




**మార్కాపురం పెన్ పవర్, ఆగస్టు 10:**

అనారోగ్యం వస్తే ఆదుకునే వైద్యం... ఇప్పుడు మార్కాపురంలో సామాన్యుడి నడ్డి విరుస్తుంది. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు "అందినకాడికి దోచుడు" అన్నట్టు వ్యవహరిస్తున్నాయి.

**డబ్బుంటేనే ట్రీట్‌మెంట్..**

మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు సరిగా చూస్తారో లేదో అని రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడ సాధారణ జ్వరం, కడుపు నొప్పికి కూడా సి.బి.సి, ఈ.సి.జి అంటూ 4–5 టెస్టులు రాసి ?3000 నుంచి ?8000 వరకు బిల్లులు ఇస్తున్నారు. పట్టణం లోని కొన్ని నర్సింగ్ హోమ్‌లలో సింగిల్ బెడ్‌కు రోజుకు ?2500, ఆక్సిజన్‌కు గంటకు ?500 పైనే వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**కమీషన్ కోసం రిఫరల్స్..**

పట్టణంలోని కొన్ని డయాగ్నోస్టిక్ సెంటర్లు, మెడికల్ షాపులతో ఆస్పత్రులకు ఒప్పందాలు ఉన్నాయి. డాక్టర్ దగ్గరికి వచ్చిన ప్రతి పేషెంట్‌ను వాళ్ల దగ్గరికే పంపి కమీషన్ తీసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మందులు కూడా వాళ్లు చెప్పిన షాపులోనే కొనాలంటూ ఒత్తిడి చేస్తున్నారని తర్లుపాడుకి చెందిన రమేష్ అనే వ్యక్తి వాపోయారు.

**అంబులెన్స్ – కన్సల్టేషన్ దోపిడీ..**

మార్కాపురం నుంచి ఒంగోలు, గుంటూరు,విజయవాడ రిఫర్ చేసే పేరుతో అంబులెన్స్‌కు ?8000 నుంచి ?12000 వరకు డిమాండ్ చేస్తున్నారు. కన్సల్టేషన్ ఫీజు ?200 నుంచి ?1000 వరకు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రేట్లు ఎక్కడా కనిపించడం లేదు

**అధికారులు మౌనం..**

ఇన్ని ఫిర్యాదులు వచ్చినా జిల్లా వైద్యాధికారి కార్యాలయం, డ్రగ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు పేరుకే పరిమితమయ్యాయి. ఫిర్యాదు చేస్తే తర్వాత చూస్తాం అని తిప్పి పంపుతున్నారని బాధితులు చెబుతున్నారు. దీంతో ఆస్పత్రుల యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నాయి.

**ప్రజల ఆవేదన..**

ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ 11 గంటలకే వెళ్లిపోతాడు. ప్రైవేట్‌కు వెళ్తే జేబు ఖాళీ. మధ్యతరగతి వాళ్లం అప్పులు చేసి వైద్యం చేయించుకోవాలా? అని కొనకలమెట్ల కు చెందిన ఓ మహిళ ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మార్కాపురంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులపై ఆకస్మిక తనిఖీలు చేసి, రేట్లను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తల్లీబిడ్డలకు మరింత భరోసా.. నూతన ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రారంభం



**మార్కాపురం పెన్ పవర్ 11**

తల్లీబిడ్డల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించేందుకు నూతన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను సోమవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి,జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, జిల్లా డీఎంహెచ్ఓ తదితర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అత్యవసర సమయంలో సురక్షితమైన, వేగవంతమైన ఉచిత రవాణా సేవలు అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేలా ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ సేవలకు ఆధునిక సాంకేతికతను జోడించి, మరింత సమర్థవంతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి తల్లి ఆరోగ్యంగా, ప్రతి బిడ్డ సురక్షితంగా ఉండేలా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేస్తామని అన్నారు.

# శ్రావణ శోభ.. శుభకార్యాలకు సందడి!

### –పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలకు అనుకూల ముహూర్తాలు
### –ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 11 వరకు శ్రావణ మాసం
### – పెళ్లిళ్ల సీజన్‌కు తెర –వేలాది వివాహాలకు ఇప్పటికే ఏర్పాట్లు
### –కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు పెరుగుతున్న డిమాండ్





**బ్యూరో పెన్ పవర్ ప్రకాశం ఆగస్టు11:**

తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాల్లో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. పండుగలు, పూజలు, వ్రతాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనే ఈ మాసాన్ని శుభకార్యాలకు అనుకూలమైన కాలంగా చాలామంది భావిస్తారు. ఈ ఏడాది శ్రావణ మాసం ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 11 వరకు కొనసాగనుంది. దీంతో పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలకు ఏర్పాట్లు ఊపందుకోనున్నాయి.

**ముహూర్తాల కోసం ఎదురుచూపులు**

శ్రావణ మాసంలో శుభ ముహూర్తాలు అధికంగా ఉండటంతో వివాహాలు నిర్వహించేందుకు కుటుంబాలు ఆసక్తి చూపుతున్నాయి. పురోహితుల సమాచారం ప్రకారం ఆగస్టు నెలలో 16, 17, 20, 21, 22, 23, 26, 27, 28, 29, 30 తేదీలను శుభకార్యాలకు అనుకూలమైన రోజులుగా పేర్కొంటున్నారు. సెప్టెంబర్‌లో 3, 4, 5, 8, 10, 11 తేదీల్లోనూ శుభ ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే వివాహం లేదా ఇతర శుభకార్యానికి తుది ముహూర్తాన్ని కుటుంబ సంప్రదాయాలు, ప్రాంతీయ పంచాంగం, తిథి–నక్షత్రాలు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం పురోహితుల సూచనతో నిర్ణయించుకోవడం ఆనవాయితీ.

**కళ్యాణ మండపాలకు పెరిగిన డిమాండ్...**

శ్రావణ మాసం ప్రారంభానికి ముందే వివాహాలకు సంబంధించిన ఏర్పాట్లు మొదలయ్యాయి. కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు, పూల అలంకరణ, డెకరేషన్, ఫోటోగ్రఫీ, బ్యాండ్, బాజా వంటి వివాహ సేవలకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు కుటుంబాలు ముందుగానే వేదికలను బుక్ చేసుకుంటున్నాయి.

**పెళ్లి సందడితో వ్యాపార వర్గాల్లో ఉత్సాహంలి...**

వివాహాల సీజన్ ప్రారంభం కావడంతో వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణాల షాపులు, పూల వ్యాపారులు, క్యాటరింగ్ నిర్వాహకులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ఫోటోగ్రాఫర్లు, మేకప్ కళాకారులు తదితర వ్యాపార రంగాల్లోనూ సందడి పెరగనుంది. పెళ్లి కుటుంబాలు వస్త్రాలు, ఆభరణాలు, బహుమతులు, వివాహ సామగ్రి కొనుగోళ్లకు సిద్ధమవుతున్నాయి.

**వేలాది పెళ్లిళ్లకు అవకాశం..**

శ్రావణ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో దాదాపు 10 వేలకుపైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో వివాహ రంగంపై ఆధారపడిన అనేక కుటుంబాలకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభించనున్నాయి.

**సంప్రదాయానికి.. ఆధునికతకు కలయిక...**

శ్రావణ మాసంలో జరిగే శుభకార్యాల్లో సంప్రదాయ పద్ధతులకు ప్రాధాన్యం ఇస్తూనే ఆధునిక హంగులు జోడించేందుకు యువత ఆసక్తి చూపుతోంది. సంప్రదాయ వివాహాలతో పాటు థీమ్ డెకరేషన్లు, ప్రత్యేక ఫొటోషూట్లు, సంగీత కార్యక్రమాలు, రిసెప్షన్లకు కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. మొత్తంగా శ్రావణ మాసం రాకతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొనడంతో పాటు వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలతో శుభకార్యాల సందడి మొదలుకానుంది. ఒకవైపు ఆధ్యాత్మిక శోభ.. మరోవైపు వివాహ వేడుకల హడావుడితో శ్రావణ మాసం ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**

భూములు రీ- సర్వే ప్రక్రియను ఎన్ని మండలాలు పూర్తి చేశారో వివరాలు అడిగి తెలుసుకుని, మిగిలిన మండలాల్లో రీ- సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి రాజా బాబు సూచించారు. మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్.ఓ.ఆర్, అసైన్మెంట్స్, రీ సర్వే, పట్టాదారు పాస్ పుసకాల పంపిణీ, పి జి ఆర్ ఎస్, భూముల మెడిటేషన్ 22ఖ సమస్యలు పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఒంగోలు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పి.రాజా బాబు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. గ్రీవెన్స్ అర్జీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కలెక్టరేట్ నుంచి సంబంధిత ఆర్డీవోలు, సబ్ కలెక్టర్ కార్యాలయానికి అర్జీలను పంపించాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పురోగతి పెరిగేలా చర్యలు తీసుకోవాలనీ ఆయన





స్పష్టం చేశారు. పి.జి.ఆర్. యస్.కి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలించి రెవిన్యూ, భూ సమస్యలు, ఫ్యామిలీ సంబంధిత సమస్యలు లాంటివి విడి విడిగా చేసి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవరమైన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా వచ్చిన అర్జీలను తిరస్కరించకుండా పరిష్కరించే విధంగా తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పి జి ఆర్ ఎస్ పర్యవేక్ష, భూ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలకు గిద్దలూరు ఎస్సి-1, కాలేజీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు ఎంపిక



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో గిద్దలూరు ఎస్సి-1 హాస్టల్ మరియు కాలేజీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.అండర్-17 లాంగ్ జంప్: గిద్దలూరు ఎస్సి-1 హాస్టల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి యం. హేమంత్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 100 మీటర్ల పరుగుపందెం: అదే హాస్టల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి సి.హెచ్. భవనేశ్వర ఆచారి 100 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి అర్హత పొందారు. అండర్-23 షాట్‌పుట్: గిద్దలూరు కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఐ. నాగార్జున షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యతో పాటు క్రీడారంగంలోనూ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను మార్కాపురం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. లక్ష్మా నాయక్, గిద్దలూరు ఏ ఎస్ డబ్ల్యూ ఓ విజయభాస్కర్, హాస్టల్ వార్డెన్ బి. ఆంజనేయరెడ్డి హాస్టల్ సిబ్బంది అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నెమలిని వేటాడి చంపిన కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**

గిద్దలూరు మండలం గండికోట పంచాయతీ దేవనగరంలో నెమలిని వేటాడి చంపిన ముగ్గురు నిందితులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారినుండి నెమలిని వేటాడేందుకు వినియోగించే ఉచ్చులు , నెమలి మాంసం నెమలి ఈకలను స్వాధీనం చేసుకున్నారు. దేవనగరం లో నెమలి మాంసం ఉందనే సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు గ్రామంలో తనికీలు నిర్వహించారు.గ్రామానికి చెందిన దండు ఓబులేసు, దండు సుబ్బయ్య, తాటారి బాబురావుల వద్ద ఉచ్చులు దొరికాయి. విచారణ చేయగా నెమలిని చంపినట్లు తేలింది. లభించిన ఆధారాలప్రకారం ఇరువురి ఇండ్లలో నెమలి మాంసం దొరికింది. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు డి ఆర్ ఓ రాజశేఖర్ గౌడ్ తెలిపారు.

## గిద్దలూరు ట్రాఫిక్ సమస్యల పరిష్కారించాలి

### అర్బన్ సీఐ కి బీజేపీ నాయకుల వినతి




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**

గిద్దలూరులో జనతా వారిది కార్యక్రమాన్ని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో లో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. గిద్దలూరు పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, రోడ్లపై అక్రమంగా వాహనాల పార్కింగ్‌ను నియంత్రించాలని కోరారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాదుల్ల మార్కెట్ యార్డె డైరెక్టర్ .ముప్పూరి శ్రీనివాసులు బిజెపి నాయకులు నాగేశ్వరరావు టౌన్ వైస్ ప్రెసిడెంట్ పాండు బిజెపి నాయకులు సుబ్బరాయుడు బిజెపి నాయకులు శివ కుమార్ రెడ్డి బిజెపి నాయకులు బాజీ బిజెపి నాయకులు. సుబ్బారెడ్డి బిజెపి నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల చరిత్రను.. ఈ యువ డాక్టర్ మారుస్తారా..!

### మంత్రి గొట్టిపాటి కంచుకోటలో డాక్టర్.అశోక్ కుమార్ దూకుడు.

### క్షేత్రస్థాయి వ్యూహాల్లో దిట్ట అయిన మంత్రికి సవాలు.





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 10**

రాష్ట్ర క్యాబినెట్ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ వరుసగా నాలుగు సార్లు అద్దంకిలో విజయం సాధించి, గత రెండు దశాబ్దాలుగా అద్దంకి నియోజకవర్గాన్ని తన కంచుకోటగా మార్చుకున్నారు. ఓటమి ఎరుగని నేతగా ఉన్న ఆయనకు దీటుగా నిలబడే కీలక బాధ్యతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అద్దంకి సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ స్వీకరించారు. తనకు పూర్తిగా కొత్త ప్రాంతమైనప్పటికీ నియోజకవర్గంలోనే సొంతంగా ఆసుపత్రిని నిర్మించి, కుటుంబ సమేతంగా ఇక్కడే ఉంటూ అద్దంకి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు.

**వ్యూహాల మంత్రికి యువ నేత సవాళ్లు..**

ఓట్ల నిర్వహణ, క్షేత్రస్థాయి వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయడంలో మంత్రి గొట్టిపాటి. రవికుమార్ దిట్ట అనే పేరుంది. సాధారణంగా ఎన్నికలకు ఆరు నెలల ముందే మాత్రమే ఆయన రంగంలోకి దిగి, తన నమ్మకమైన బృందంతో కలిసి ఆయన ప్రణాళికలు ప్రారంభిస్తుంటారు. ఆ కొద్ది నెలల వ్యవధిలోనే నియోజకవర్గంలోని కీలక నాయకులను, ప్రధాన వర్గాలను వ్యూహాత్మకంగా తనవైపు తిప్పుకోవడంలో ఆయన శైలి ప్రత్యేకమైనది. ఇటువంటి రాజకీయ చతురత కలిగిన ప్రత్యర్థిని ఎదుర్కొంటూ అశోక్ కుమార్ ఇప్పటినుండి తన వ్యూహాలకు పదును పెడుతున్నారని నియోజకవర్గంలో వినికిడి, అదే సమయంలో అధికార పార్టీ నేతల అక్రమాలపై, ముఖ్యంగా మంత్రి గొట్టిపాటికి సైతం అశోక్ కుమార్ నేరుగా సవాళ్లు విసురుతున్నారు. అధికార అండతో జరుగుతున్న భూకబ్జా కుంభకోణాలను వెలికితీసి ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతున్నారు. ఆయన నాయకత్వంలో చేపట్టిన భారీ ద్విచక్రవాహన ర్యాలీ, నిరాహార దీక్షలు, వ్యూహాత్మక విలేకరుల సమావేశాలు విశేష ప్రజాదరణ సాధించడంతో పార్టీ కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం రెట్టింపయింది వైసిపి నాయకులు సంబరాలు చేసుకుంటున్నారు.

**అసంతృప్తిని అవకాశంగా మలుచుకుంటూ..**

గత రెండు దశాబ్దాలుగా ప్రజల మనిషిగా ఉన్న గొట్టిపాటి. రవికుమార్.. ప్రస్తుతం రాష్ట్ర మంత్రి హోదాలో తీరిక లేకుండా ఉండటం వల్ల స్థానిక ప్రజలకు, శ్రేణులకు కొంత దూరమయ్యారనే చర్చ సాగుతోంది. ఒకప్పుడు ఆయన వద్దకు వెళ్తే పని పూర్తవుతుందనే ధీమా ఉండేదని, కానీ ఇప్పుడు కనీసం వ్యక్తిగత సహాయకులు కూడా ఫోన్లకు స్పందించడం లేదని సొంత పార్టీ నాయకులే వాపోతున్నారు. అధికార పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్న ఈ అసంతృప్తిని యువ నాయకుడు అశోక్ కుమార్ పూర్తిస్థాయిలో అనుకూలంగా మలుచుకుంటున్నారని ఇప్పటికే అద్దంకిలో ప్రచారం జోరు అందుకుంది.

**మారుతున్న అంతర్గత సమీకరణాలు.. కీలక నేతలతో సమన్వయం..**

వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ కీలక రాష్ట్ర స్థాయి నాయకుడి సొంత నియోజకవర్గం అద్దంకి కావడం ఇక్కడ గమనించాల్సిన ప్రధాన అంశం. రాష్ట్ర స్థాయిలో పార్టీ పదవులు, టికెట్ల కేటాయింపును సైతం ప్రభావితం చేయగల సత్తా ఆయనకు ఉంది. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వస్తే స్థానిక అభ్యర్థి ఓటమి పాలైనా సరే, ఆ రాష్ట్ర స్థాయి నేత అద్దంకి నియోజకవర్గాన్ని తన మాటతో శాసించగలరు. గత ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. పార్టీ శ్రేణులు తమ పనుల కోసం ఆయనపైనే ఆధారపడే పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. ప్రస్తుతం క్యాడర్ అశోక్‌తో కలిసి నడుస్తున్నప్పటికీ ఒక వర్గం పూర్తిగా ఆ రాష్ట్రస్థాయి నాయకుడి వైపే ఉండటం సమన్వయకర్తకు ఒకింత ఆందోళన కలిగించే అంశమే. ?అయితే, అశోక్ కుమార్ ప్రదర్శిస్తున్న దూకుడుతో నియోజకవర్గంలోని నాయకులు ఒక్కొక్కరిగా ఆయన చెంతకు చేరుతున్నారు. అదే సమయంలో కొంతమంది నేతలు ఇరువురికీ అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల అశోక్ కుమార్ ఆ రాష్ట్ర స్థాయి నాయకుడిని ప్రత్యేకంగా కలిశారని సమాచారం. ఆయన సలహాలు, సూచనల మేరకే అశోక్ నియోజకవర్గంలో మరింత దూకుడుగా ముందుకు సాగుతున్నారని స్థానికంగా గట్టిగా వినిపిస్తోంది. దీనికి తోడు నియోజకవర్గంలో బలమైన నేత, మాజీ శాసనసభ్యులు కరణం. బలరాం పూర్తిస్థాయి మద్దతు అశోక్ కుమార్‌కు ఉండటం ఆయనకు బాగా కలిసొచ్చే పరిణామం. అదే సమయంలో అద్దంకి సంబంధించి ఇతర ముఖ్య నాయకులతో కూడా అశోక్ సత్సంబంధాలు కొనసాగించడం పార్టీ శ్రేణులకు సానుకూలాంశం.

**చరిత్రను తిరగరాసే దిశగా..**

అద్దంకి వైసీపీలో ఎన్నికల ముందు వరకు ఎవరికీ టికెట్ ఖరారు కాదని, అదే తరహాలో ఇప్పుడు ఉన్న నేత రాబోయే ఎన్నికల్లో పోటీ చేయరని, అశోక్ కుమార్ స్థానంలో కొత్త వ్యక్తి పోటీకి వస్తారంటూ సొంత వైసిపిలోని కొందరు నేతలు, అటు టిడిపి.. ప్రచారం చేస్తుంది. జరుగుతున్న ప్రచారాలను అశోక్ పట్టించుకోకుండా, తన దూకుడును యధావిధిగా కొనసాగిస్తున్నారు. ఇలాంటి ఊహాగానాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో అద్దంకి బాధ్యతలు అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ఏకైక ధ్యేయమని స్పష్టం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి ఆ విజయాన్ని అధినేతకు కానుకగా అందిస్తానని డాక్టర్ అశోక్ కుమార్ ధీమా వ్యక్తంచేశారు. ఏది ఏమైనప్పటికీ వచ్చే ఎన్నికల్లో 25 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ మంత్రికి, మొదటిసారి బరిలోకి దిగుతున్న యువ వైద్యుడికి మధ్య జరిగే పోరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారనుందని స్థానికులు విశ్లేషిస్తున్నారు.

## జెవివి సమత రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కొల్లా పద్మ

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 11**



జన విజ్ఞాన వేదిక మహిళా విభాగం "సమత" రాష్ట్ర మహాసభలు ఆగస్టు 8, 9 తేదీల్లో గుంటూరులోని శంకర్ రెడ్డి ప్రకృతి వైద్యశాలలో ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు సుమారు 200 మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళల సామాజిక అభివృద్ధి, సమానత్వం, శాస్త్రీయ దృక్పథం తదితర అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహాసభలకు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి పాల్గొని మహిళల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. మహాసభల్లో 17 మందితో జన విజ్ఞాన వేదిక మహిళా విభాగం "సమత" రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన కొల్లా పద్మ గారు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొల్లా పద్మ మాట్లాడుతూ, "శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకునే విధంగా కృషి చేస్తాను. సమాజంలో మహిళలకు సమానత్వం, శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందించేందుకు కృషి చేస్తాను" అని తెలిపారు. కొల్లా పద్మ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు, చిన్నాజీ, పాపారాయుడు, గయాజ్, కంచర్ల వెంకటేశ్వర్లు, కొండమ్మ, మీనా తదితరులు అభినందనలు తెలిపారు.

## 20 ఏళ్లుగా అసంపూర్తి షాదిఖానా.. మైనార్టీలను ప్రభుత్వం మరిచిందా



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**



జిల్లా కేంద్రంలో మైనార్టీల కోసం నిర్మిస్తున్న షాదిఖానా భవనం గత 20 ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటం దురదృష్టకరమని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శంకుస్థాపన చేసి రెండు దశాబ్దాలు గడిచినా భవనం పూర్తి కాకపోవడం పేద మైనార్టీ కుటుంబాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. స్థానిక నేతలు మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే తప్ప వారి సంక్షేమం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే, గ్రామాల్లో పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీ నుండి ఇప్పటివరకు ఉన్న మైనార్టీ శాఖ మంత్రులందరూ ఈ సమస్య పరిష్కారంలో విఫలమయ్యారని అన్నారు. శంకుస్థాపన సమయంలో పుట్టిన పిల్లలు కూడా ఓటు వేసే వయసు వచ్చారని, కానీ భవనం మాత్రం పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం షాదిఖానా ప్రదేశం మూత్రశాలగా, మద్యం తాగేవారి అడ్డాగా మారిందని, వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని మంత్రివర్యులను డాక్టర్ మహబూబ్ వలి డిమాండ్ చేశారు.

# దళితులకు ఆరామ క్షేత్రం నిర్మించాలి - సుజన్ మాదిగ

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**

ఒంగోలు నగరంలో దళితులకు 30 సెంట్లు స్థలము కేటాయించి ఆరామ క్షేత్రం నిర్మించాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ, ఒంగోలు నగరంలో దాదాపు 40 శాతం మంది దళితులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారని, అద్దె ఇళ్లలో నివసించే ప్రజలు ఎవరైనా చనిపోతే, కనీసం శవాన్ని కూడా అక్కడ పెట్టుకోవడానికి ఇళ్ల యజమానులు ఒప్పుకోవడం లేదని, ఆయన అన్నారు. దాంతో పాటుగా ఒంగోలు నగరంలో అన్ని కులాల వారికి ఆరామ క్షేత్రాలు ఉన్నాయని, కేవలం దళితులకు మాత్రమే ఆరామ క్షేత్రాలు లేవని ఆయన అన్నారు. అనేక సందర్భాల్లో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో తీసుకువెళ్ళినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికైనా ఒంగోలు శాసనసభ్యులు, దళితులకు ఆరామ క్షేత్రం స్థల విషయంలో వెంటనే స్థల సేకరణను చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని




కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ మాదిగ, ఎమ్మెస్పీఎస్ నాయకులు జయరాజు మాదిగ, తిమోతి మాదిగ, సింగయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

### మౌలిక వసతులపై స్థానిక సిబ్బందికి కీలక సూచనలు.

**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 11:**

అద్దంకి మండల పరిషత్ అభివృద్ధి అధికారి మస్తాన్ శ్రీధర్ మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా మణికేశ్వరం, కొంగపాడు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాబోయే ఎన్నికల అవసరాల నిమిత్తం పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక



సదుపాయాలు, భవనాల స్థితిగతులను ఆయన స్వయంగా పరిశీలించి ఆరా తీశారు. ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు తదితర సదుపాయాల కల్పనపై పంచాయతీ కార్యదర్శులకు, స్థానిక సిబ్బందికి పలు కీలక సూచనలు జారీ చేశారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి!

## మేదరమెట్ల సెంటర్‌లో వాహనదారులకు అవగాహన.

## రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని: ఎస్.ఐ రమేష్ బాబు.





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 11:**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించి సురక్షితంగా ప్రయాణించాలని మేదరమెట్ల ఎస్.ఐ రమేష్ బాబు సూచించారు. మంగళవారం మేదరమెట్ల సెంటర్‌లో ఆయన ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనదారులకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని ఆపి, ప్రమాదాల పట్ల అప్రమత్తం చేయడంతో పాటు పలువురికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు బలమైన గాయాలు కావడం వల్లే ఎక్కువ శాతం ప్రాణనష్టం జరుగుతోందని ఎస్ఐ రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద తీవ్రతను తగ్గించి ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ (ట్రాఫిక్) నిబంధనలను విధిగా పాటించాలని, ఇది కేవలం పోలీసుల జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాకుండా తమ కోసం ఎదురుచూసే కుటుంబ సభ్యుల కోసం అనే విషయాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..:** వాహనం నడిపేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్ మాట్లాడరాదని, పరిమితికి మించిన వేగంతో ప్రయాణించకూడదని స్పష్టం చేశారు. అవగాహన కల్పించినప్పటికీ ఇకపై ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మేదరమెట్ల పోలీసు సిబ్బంది, స్థానికులు, వాహనదారులు పాల్గొన్నారు.

# 13 నుండి 15 దాకా సినీ సంగీత నృత్య కార్యక్రమాలు

### ఘంటసాల స్వరాంజలి సంస్థ అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 11**
ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మక సమితి సౌజన్యంతో పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యములో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 13 గురువారం, 14 శుక్రవారం, 15 శనివారంలలో మూడు రోజులపాటు సినీ సంగీత నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంస్థ అధ్యక్షురాలు డా. చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా సంస్థ గౌరవ అధ్యక్షులు మండవ మురళీకృష్ణ విచ్చేస్తారని, 13, 14వ తేదీలలో జరుగు కార్యక్రమాలు స్థానిక లక్కీ కాన్ఫరెన్స్ హాల్ నందు, 15వ తేదీ కార్యక్రమం సి వి ఎన్ రీడింగ్ రూమ్ కళావేదికపై సాయంత్రం 4గం.లకు ప్రారంభమౌతాయని వివరించారు. కార్యక్రమంలో లబ్ధ ప్రతిష్టులైన గాయనీగాయకులు స్ఫూర్తివంతమైన సినీ గీతాలు ఆలపిస్తారని తెలిపారు. ఈ సినీ సంగీత నృత్య కార్యక్రమాల కరపత్రాలను మండవ మురళీకృష్ణ తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. కరపత్రావిష్కరణలో ఎస్ కే బాబు, ప్రకాశం జిల్లా కళాకారుల సమాఖ్య అధ్యక్షులు ప్రముఖ గాయని లక్ష్మీ తులసి, తాళ్లూరి శ్రీదేవి, కే లక్ష్మి, డా. చల్లా నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థినీలు

**సి.ఎస్.పురం,పెన్ పవర్, ఆగస్టు11**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్ షిప్-26లో భాగంగా మంగళవారం ఒంగోలులోని మినీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో సి.ఎస్.పురంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థినీలు ప్రతిభకనబరిచారు. వివిధ క్రీడల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైజంప్ విభాగంలో కళాశాల విద్యార్థిని కె. యమున ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. అలాగే బ్యాడ్మింటన్లో టి. దేరిస్సా, చెస్ లో ఎం. అజిత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల విద్యార్థినీలు క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అండ్ సెక్రటరీ కదిరి పార్థసారథి, కళాశాల డీన్ డాక్టర్ మోసే హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థినీలను అభినందించారు.

# నేడు ముండ్లపాడు, తాళ్ళ పల్లె గ్రామలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

### డీఈఈ వై శేషగిరి రావు



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**
నేడు బుధవారం ఉదయం గం. 8:00 నుండి మధ్యాహ్నం గం. 12:00 ల వరకు ముండ్లపాడు. తాళ్ళ పల్లె , చట్టిరెడ్డి పల్లె గ్రామాలలో విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్, ట్రీ కటింగ్ నిమిత్తం గృహ విద్యుత్ , వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయబడునాని డీ ఈ ఈ శేషగిరిరావు ఒక ప్రకటంలో తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము. కావున ఆ యా గ్రామాల ప్రజలు గమనించి సహకరించ వలసినదిగా కోరారు.

# యాక్సిడెంట్‌కు గురైన బీజేపీ నాయకుడు వీరయ్యను పరామర్శించిన బిజెపి నాయకులు ఉదయ శంకర్

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**
గిద్దలూరు భారతీయ జనతా పార్టీ నాయకులు వీరయ్య కి యాక్సిడెంట్ జరిగిన విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఉదయ శంకర్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వీరయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ఒకరికొకరు అండగా ఉంటారని ఉదయ శంకర్ తెలిపారు. వీరయ్య త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా ఉదయ శంకర్ ఆకాంక్షించారు.



# ఆపదలో ఆదుకున్న ఆపన్నహస్తాలు..

## అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి యువత, గ్రామస్థుల ఆర్థిక సాయం

**పుల్లల చెరువు పెన్ పవర్ ఆగస్టు 11**
ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి నరజాముల గ్రామ యువత, గ్రామస్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. పుల్లల చెరువు మండలం నరజాముల ఎస్సీ పాలెంకు చెందిన కాటిపల్లి ఆదాము గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్య చికిత్సకు అధికంగా ఖర్చులు కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది.ఆదాము కుటుంబ పరిస్థితిని గమనించిన గ్రామ పెద్దలు తొలుత తమ వంతుగా ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు.అనంతరం కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన గ్రామ యువకులు ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పెద్దల సూచన మేరకు ఆదాము కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న యువత, గ్రామస్థులు వెంటనే స్పందించి తమకు తోచినంత మొత్తాన్ని విరాళంగా అందించారు.నరజాముల గ్రామస్థులతో పాటు నరజాముల తండా వాసులు కూడా మానవతా దృక్పథంతో స్పందించి తమ వంతు సహాయాన్ని అందించారు. అలాగే ఎంద్రపల్లి గ్రామానికి చెందిన పెట్రోల్ బంకు నిర్వాహకులు చిరదల అశోక్ సైతం ఆదాము కుటుంబ పరిస్థితిని తెలుసుకుని మానవీయ దృక్పథంతో తమ వంతు ఆర్థిక సహాయం అందించారు.ఇలా వివిధ వర్గాల నుంచి అందిన విరాళాలను యువకులు సమీకరించారు. సేకరించిన మొత్తంతో మంగళవారం ఆదాము ఇంటికి వెళ్లిన యువకులు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి రూ.53 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. సమాజంలో ఎవరికి కష్టం వచ్చినా అది వారి సమస్యగా కాకుండా మన సమస్యగా భావించి ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సహాయం చేయాలని కోరారు. చిన్న మొత్తంలో అందించే సహాయం సైతం ఆపదలో ఉన్న కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఆదాము కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన గ్రామ పెద్దలు, నరజాముల గ్రామస్థులు, నరజాముల తండా వాసులు, యువకులు, ఎంద్రపల్లి పెట్రోల్ బంకు నిర్వాహకులు చిరదల అశోక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అందరూ కలిసి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



# అంగన్వాడీ సిబ్బందికి 'జ్ఞాన జ్యోతి--2' శిక్షణ ప్రారంభం

## పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ సిబ్బంది కృషి కీలకం: ఎంఈఓలు



**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 11:**
కందుకూరు అర్బన్, రూరల్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు 'జ్ఞాన జ్యోతి--2' రెండో సంవత్సరం శిక్షణ కార్యక్రమం మంగళవారం కందుకూరు బాయ్స్ హైస్కూల్‌లో ప్రారంభమైంది. సీడీపీఓ కే. ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ--1 శర్మ, ఎంఈఓ--2 సుబ్బారెడ్డి, సీడీపీఓ ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పనిచేసే సిబ్బందికి ఎంతో సహనం, ఓర్పు అవసరమని అన్నారు. చిన్న వయసులోనే పిల్లలకు సరైన విద్య, సంస్కారం, పోషణ అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని తెలిపారు. తాము కూడా చిన్నతనంలో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం చేసిన విషయాన్ని వారు గుర్తు చేసుకున్నారు. చిన్నారుల్లో ఎదుగుదల, నవచేతన, ఆదర్శ భావాలు పెంపొందించడంతో పాటు వారి శారీరక, మానసిక, సామాజిక, విద్యాపరమైన సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ టీచర్లు కృషి చేయాలని సూచించారు. ప్రతి చిన్నారిని ప్రత్యేకంగా గమనించి వారి అవసరాలకు అనుగుణంగా శిక్షణ, ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. ఈ మూడు రోజుల పాటు జరిగే శిక్షణలో చిన్నారుల అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించనున్నారు. శిక్షణలో భాగంగా డీఆర్పీలు పొన్నగంటి వెంకటేశ్వర్లు, దామా కొండపనాయుడు శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఎస్కే షకీలా బేగం, యు. ప్రభావతి, ఎల్. లక్ష్మీదేవమ్మతో పాటు కందుకూరు అర్బన్, రూరల్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# మంచి ఆహార అలవాట్లతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యం

## ఆస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కార్తీక్ కామినేని

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 11**
సమాజ నిర్మాణం కోసం మనందరం కృషి చేయాలని నారాయణ స్కూల్స్ క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి అన్నారు. నారాయణ స్కూల్స్‌లోని ఎన్‌స్పైరా ఆధ్వర్యంలో మహేంద్రనగర్‌లోని నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో మంగళవారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణ స్కూల్స్ సిబ్బంది, విద్యార్థులకు ఉచితంగా బీపీ, ఈసీజీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు మంచి ఆరోగ్య పద్ధతులు, ఆహార నియమాలపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ నుంచి వచ్చిన డాక్టర్ కార్తీక్ కామినేని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ కామినేని మాట్లాడుతూ.. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వార్షికోత్సవం సందర్భంగా నారాయణ స్కూల్‌లో ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బందికి ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు వారి సాధారణ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, అప్పుడే మంచి సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. నారాయణ స్కూల్స్ క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి మాట్లాడుతూ నారాయణ స్కూల్స్ యాజమాన్యం విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్కూల్స్ హెచ్.ఆర్. విభాగం ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి శిబిరాల ద్వారా విద్యార్థులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన నివారణ మార్గాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మస్తానయ్య, ప్రిన్సిపాల్ నాగ సురేష్, ఏవో నాగలక్ష్మి పాల్గొన్నారు.



# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026 దరఖాస్తులు స్వీకరణ

### 18 లోగా దరఖాస్తులు సమర్పించాలి - డి ఈ ఓ రేణుక

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**



సెప్టెంబర్ 5న మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జరుగనున్న ఉపాధ్యాయ దినోత్సవము (గురుపూజోత్సవం) సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హత కలిగిన వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలోని గవర్నమెంట్, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకులాలు, కేజీబీవీలు, డైట్ కాలేజీ (లెక్చరర్స్/ సీనియర్ లెక్చరర్స్), ఏ.పి గురుకులాల మేనేజ్మెంట్ లలో పనిచేయుచున్న ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు.కనీసం పది (10) సంవత్సరముల సర్వీస్ కంప్లీట్ చేసి ఉండాలని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారి మండల విద్యాశాఖాధికారులకు ఈనెల 18వ తేది లోపు అందజేయాలని కోరారు. మండల విద్యా శాఖాధికారులు దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత ఉప విద్యాశాఖాధికారుల వారికి ఈ నెల 20వ తేది లోపు అందించాలనీ కోరారు. ఉప విద్యాశాఖాధికారులు దరఖాస్తులను పరిశీలించి జిల్లా విద్యాశాఖాధికారి, ప్రకాశం జిల్లా వారికి సాయంత్రం 5 గంటల లోగా అందజేయాలని ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి సి. వి. రేణుక ఒక ప్రకటన లో తెలియజేశారు. ఎలాంటి నేరారోపణలు, శాఖాపరమైన అభియోగాలు, సివిల్, క్రిమినల్ కేసులు ఉండకూడదనీ, దీనికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. కావున నిర్దిష్టమైన నమూనాలో దరఖాస్తులను సంబంధిత ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు కార్యాలయం ద్వారా ఈ నెల 22 వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు జిల్లా విద్యాశాఖాధికారి, ప్రకాశం జిల్లా కార్యాలయానికి పంపిచాలని, తదుపరి సమర్పించే ప్రతిపాదనలు స్వీకరించబడవని డిఇఓ తెలిపారు.

# ఛాంపియన్ షిప్ క్రీడా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినీల ప్రతిభ

### అభినందించిన ప్రిన్సిపాల్ షేక్ రేష్మ



**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 11**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో సి.ఎస్.పురం కేజీబీవీ విద్యార్థినీలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం ఒంగోలులో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో లాంగ్ జంప్ లో వల్లెం సింధు ప్రథమ స్థానం సాధించింది. హైజంప్ లో కేతనబోయిన మంజుల ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.కంచర్లవారిపల్లిలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో విజయం సాధించి అదే ఉత్సాహంతో జిల్లాస్థాయి పోటీల్లోనూ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు.ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ మాట్లాడుతూ విద్యార్థినీలు క్రీడల్లో రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పీఈటీ రఫియా బేగం ఆధ్వర్యంలో విద్యార్థినీలకు అందించిన శిక్షణ ఫలితంగా నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో విజయాలు సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలతో పాటు వారికి శిక్షణ అందించిన పీఈటీ రఫియా బేగంను అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లోనూ విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభకనబరిచి విజయం సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

# పి. గుడిపాడులో డీపీవో ఆకస్మిక తనిఖీ

## పారిశుధ్య పనుల పరిశీలన.. గ్రామస్తులకు అవగాహన.





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 11:**

కొరిశపాడు మండలం, పి. గుడిపాడు గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం. అనుపమ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు, ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ ప్రక్రియను ఆమె నిశితంగా పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల విధులు, వాహనాల పనితీరును పరిశీలించిన అనంతరం గ్రామస్తులతో డీపీవో ముఖాముఖి మాట్లాడారు. తడి, పొడి చెత్త మధ్య ఉన్న తేడాలను వివరించి వాటిని విడివిడిగా ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని, పొడి చెత్తను పునర్వినియోగానికి పంపవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి పారిశుధ్య సేవలపై అభిప్రాయాల సేకరణకు వచ్చే ఆటోమేటిక్ వాయిస్ కాల్ సర్వే గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ ఫోన్ కాల్‌కు సానుకూలంగా స్పందించడం ద్వారా ప్రభుత్వ పథకాలు సేవలు మరింత మెరుగ్గా ప్రజలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. చెత్త సేకరణ, స్వచ్ఛ రథం సేవలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. గత నెలలో జరిగిన వాయిస్ కాల్ సర్వేలో తక్కువ సానుకూల అభిప్రాయాలు వచ్చిన పంచాయతీల అభివృద్ధి అధికారులతో డీపీవో వీడియో కాల్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య పనుల మెరుగుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు ప్రతిరోజూ ఉదయాన్నే క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు.

**దారి వివాదం పరిశీలన..**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దాఖలైన ఒక దారి వివాదపు అర్జీపై డీపీవో స్పందించారు. అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమగ్రంగా సర్వే చేయించి అందరికీ దారి ఉండేలా సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన గ్రామాన్ని నిర్మించవచ్చని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి. గుడిపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి, ఇతర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాల అమరవీరుల 29వ స్మారక దినం

### నీలం నాగేంద్రరావు నివాళి




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరులో అమరులైన మాల వీరులు పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ త్యాగం చిరస్మరణీయమని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అన్నారు. మంగళవారం మార్కాపురం ప్రెస్ క్లబ్‌లో మాల అమరవీరుల 29వ స్మారక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ 1997 ఆగస్టు 11న హైదరాబాద్‌లో జరిగిన చలో సెక్రటేరియట్ ముట్టడిలో చంద్రబాబు ప్రభుత్వం జరిపించిన పోలీస్ దమనకాండలో పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ మరణించారని గుర్తు చేశారు.ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగలను చీల్చే కుట్ర జరిగిందని, దానిని వ్యతిరేకిస్తూ మాలలు పోరాడారని అన్నారు. మోడీ, కూటమి ప్రభుత్వాల మనువాద విధానాలపై మాలలు మళ్లీ ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును ఫుల్ బెంచ్‌లో సవాల్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందు స్థానిక కోర్టు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు నేతలు దారా అంజయ్య, కాకుమాను రవి, నూతలపాటి రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీకి అరవింద విద్యార్థుల ఎంపిక



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు11**

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న అమరావతి ఛాంపియన్స్ - 2026 రాష్ట్రస్థాయి పోటీలకు అరవింద పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక అరవింద పాఠశాల కరస్పాండెంట్ వాణి రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఒంగోలు పి. భాస్కర్ మినీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అండర్-17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన షేక్. సిద్దిక్ మరియు ఎమ్. సుబ్బారెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ వాణి రాధాకృష్ణ, పి.ఈ.టి లు, సిబ్బంది అభినందించారు.

# అంబవరం పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయుత

### పూర్వ విద్యార్థి ముత్యాల నారాయణరెడ్డిని సత్కరించిన ప్రముఖులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 11**

విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీట అందించాలనే ఉద్దేశంతో అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో భాగంగా వాటర్ ప్లాంట్ ను పూర్వ విద్యార్థి ముత్యాల నారాయణరెడ్డి ఏర్పాటు చేశారు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు. దీనిపై స్పందించిన పూర్వ విద్యార్థి ముత్యాల నారాయణరెడ్డి తనవంతు సహకారం అందించి వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశానికి విచ్చేసిన పూర్వ విద్యార్థులు ప్రముఖులు నేతాజీ స్కూల్ ఎమ్మెస్సార్ స్కూల్ అధినేత నేతాజీ సుబ్బారెడ్డి, డాక్టర్స్ అండ్ ఫార్మసీ వ్యవస్థాపకులు తులాబందుల చలమయ్య నాయుడు, చిట్టిబోయిన మౌలాలి, భాస్కర్ రెడ్డి మరియు పూర్వ విద్యార్థులు పాఠశాల సిబ్బంది సమక్షంలో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు తాను చదువుతున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి ముత్యాల నారాయణరెడ్డి ముందుకు వచ్చి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పనలో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు ఈ సందర్భంగా ముత్యాల నారాయణరెడ్డిని పూర్వ విద్యార్థులు పాఠశాల సిబ్బంది శాలువా తో ఘనంగా సత్కరించి అభినందించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను పెంచుకోవాలి

### - కేంద్ర జల సంఘం నోడల్ అధికారి పైల హరీష్

### జల సంరక్షణకు ఇంకుడు గుంతలు - చెక్ డ్యాములు - జల్ సంచయ్ జన భాగీదారి కార్యక్రమాలు



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 11**

భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు వర్షపు నీటిని ప్రతి చుక్కా ఒడిసిపట్టి భవిష్యత్ అవసరాలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ సంచయ్ జన భాగీదారి కార్యక్రమం క్షేత్రస్థాయిలో వేగం పుంజుకుంటోంది. జల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే విధంగా చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, రైతుల కుంటలు, పంట కాలువల అభివృద్ధి వంటి పనులను ఈ కార్యక్రమం ద్వారా చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సంతమాగులూరు మండలంలో మంగళవారం చేపట్టిన వివిధ నీటి సంరక్షణ పనులను కేంద్ర జల సంఘం విజయవాడ కార్యాలయ నోడల్ అధికారి పైల హరీష్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. చెరువులు, పంట కాలువలు, ఇంకుడు గుంతలు, రైతుల కుంటలు తదితర పనుల పురోగతిని పరిశీలించి, వాటి ద్వారా వర్షపు నీటిని ఎంత మేరకు నిల్వ చేయగలుగుతున్నారో, భూగర్భ జలాల రీఛార్జ్‌కు అవి ఏ విధంగా దోహదపడుతున్నాయో పరిశీలించారు. పనుల నాణ్యత, వినియోగం, భవిష్యత్‌లో వాటి ద్వారా కలిగే ప్రయోజనాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. వర్షపాతం సమృద్ధిగా ఉన్న సమయంలో నీటిని నిల్వ చేసుకోలేకపోతే ఎండాకాలంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా వ్యవసాయాధారిత మండలాల్లో బోర్లపై ఆధారపడే పరిస్థితి పెరుగుతున్న నేపథ్యంలో వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం అత్యంత కీలకంగా మారింది. చెరువులు, కుంటలు, కాలువలు, ఇంకుడు గుంతలు వంటి నిర్మాణాలు వర్షపు నీటిని నిల్వ చేయడమే కాకుండా భూగర్భ జలమట్టం పెరగడానికి దోహదపడతాయి. అందువల్ల నీటి సంరక్షణ పనులను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో కొనసాగించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, ఏపీవో బాలకృష్ణ నాయక్, ఈసీ సురేష్, మండల టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఆగస్టు 15లోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి

### వ్యవసాయాధికారి పి మధుబాబు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 11**

పంటల బీమా నమోదు గడువును ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ వరకు పొడిగించిందని మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి పి మధుబాబు తెలిపారు మండలంలోని పెద్ద గోగులపల్లి, రామాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉన్నందువలన ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులు తమ పంటలను పంటల బీమా పథకంలో నమోదు చేసుకొనుటకు మీ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు రైతు సేవా కేంద్రాలలో యూరియా మరియు డిఏపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు ఉపయోగించు కోవాలన్నారు అలాగే ఈ ఖరీఫ్ సీజన్లో వరి, కంది, సజ్జ, ఎండు మిరప, మినుము సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో నమోదయ్యేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, వరి పంటకు ఎకరానికి రూ.860 రూపాయల ప్రీమియంను ఆగష్టు 15వ తేదీ లోపల చెల్లించినట్లయితే ఎకరానికి 43,000 రూపాయల భీమా పొందుటకు అర్హులని తెలిపారు. అలాగే ఎకరా కంది పంటకు రూ.430, సజ్జ పంటకు రూ.156, మిరప పంటకు రూ.4500, మినుము పంటకు రూ.205 ప్రీమియం చెల్లించి ఆగష్టు 15 వ తేదీ లోపు పీఎంఎఫ్ బీవై. జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకున్నట్లయితే ఒక ఎకరా కంది పంటకి రూ.21,500 రూపాయలు, సజ్జ పంటకి రూ.15,600 రూపాయలు, మిరప పంటకి రూ.90వేలు, మినుముకు రూ.20,500 రూపాయల భీమా పొందవచ్చు అన్నారు. పంటలు సాగులో ఉన్న అన్ని గ్రామాల పరిధిలోని రైతు సేవ కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచి, ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి , గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 11**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు కింద అంగన్వాడీ కార్యకర్తలకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్లుగా పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు.శిక్షణా కార్యక్రమాన్ని వెలిగండ్ల సీడీపీఓ షేక్ ఆశాబేగం సందర్శించి పరిశీలించారు. శిక్షణలో అంగన్వాడీ కార్యకర్తలకు చిన్నారుల వయస్సుకు అనుగుణంగా బోధనా విధానాలు, స్థానికంగా లభించే వనరులను ఉపయోగించి బోధనా సామగ్రి తయారీ, పిల్లల్లో భాషా, సంఖ్యా నైపుణ్యాలను పెంపొందించే పద్ధతులపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సీడీపీఓ షేక్ ఆశాబేగం మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక దశలోనే విద్యకు బలమైన పునాది వేయడం ఎంతో ముఖ్యమన్నారు. అంగన్వాడీ దశలో పిల్లలకు వయస్సుకు తగిన అభ్యసన అనుభవాలను అందించడం ద్వారా వారిలో భాషా, సంఖ్యా నైపుణ్యాలను పెంపొందించవచ్చున్నారు. స్థానిక వనరులతో సులభంగా తయారు చేసుకునే బోధనా సామగ్రిని వినియోగించి పిల్లలకు బోధించాలన్నారు చిన్నారులకు అంగన్వాడి దశలో బలమైన పునాది కల్పించి భవిష్యత్తులో మెరుగైన విద్యాప్రగతికి దోవదపడటమే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు.

# జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో టీబీ ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**

స్థానిక జార్జి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్.సి.సి యూనిట్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ సీసీ క్యాడెట్లు మండలంలోని దరిమడుగు గ్రామంలోని 6, 7 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని పీహెచ్సీని సంప్రదించాలని సూచించారు. అలాగే అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం 34 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ సోమేష్ ఆదేశాల మేరకు జరిగింది. ఎన్ సీసీ ఏ ఎన్ ఓ కెప్టెన్ పి. అనిల్, తిప్పాయపాలెం పీహెచ్సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బండి ప్రవళిక, యు. ప్రత్యూష, సుచరిత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ ఖాసిం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. రాజబాబు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ మస్తానయ్య, డీన్ అడ్మిషన్స్ డాక్టర్ డానియల్, వివిధ విభాగాధిపతులు, ఎన్ సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# తొలిరోజు ఉత్సాహంగా సాగిన జ్ఞానజ్యోతి అంగన్వాడీ శిక్షణ కార్యక్రమం





**గుడ్లూరు, పెన్ పవర్, ఆగస్టు 11**

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులు 11 నుండి 13వ తేదీ వరకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం జరుగుతుండగా, తొలిరోజు గుడ్లూరు హైస్కూలులో ఉత్సహంగా సాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలకు డిఆర్పీలు ఏ.విజయ్ కుమార్, టి.చంద్రశేఖర్, కె.కామేశ్వరి శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో హాజరైన కార్యకర్తలకు అంగన్వాడీ కేంద్రంలో వచ్చే పిల్లలను లింగ బేధం లేకుండా చూడాలని, లింగం కారణంగా అన్యాయంగా చూడకూడదు లేదా వారికి అవకాశాలు నిరాకరించకూడదన్నారు. ప్రతి ఒక్కరూ సమాన హక్కులు, విలువలు కలిగి, అన్నిటిలోనూ పాల్గొనే అవకాశం ఇవ్వాలని వారికి తెలియజేయడమైనదన్నారు. ఉదాహరణకు అబ్బాయి అయినా అమ్మాయి అయినా ప్రతి క్రీడలో పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని తెలియజేయడమైనదని సూపర్వైజర్ కామేశ్వరి తెలిపారు. అలానే అంగన్వాడీ సెంటర్ కి వచ్చే లబ్ధిదారులకు పోషణ మరియు ఆరోగ్యం గురించి వారికి అవగాహన కల్పించడం అయినదని, బాలల రక్షణ మరియు అవసరాలకు అనుగుణమైన సంరక్షణ గురించి వారికి తెలియజేయడమైనదన్నారు. అంగన్వాడి స్కూల్ నుంచే పిల్లలకు ఇంగ్లీషు భోదించడం గురించి అంగన్వాడీ టీచర్ లకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు. ఈ విషయాలపై కార్యకర్తలకు ఈ మూడో రోజుల శిక్షణా కార్యక్రమం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ -1 బి.హరి రామ్, గుడ్లూరు హైస్కూల్ హెచ్ఎం ఇన్చార్జి మురళి, కే ఆర్ పి పి.వాణి హాజరై వారి సందేశాన్ని కూడా అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేశారు.

# ఇంటింటికీ ప్రభుత్వ మేలు తీసుకెళ్తున్నాం - ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి





**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**

సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పెద్ద నాగులవరం గ్రామంలో ఇంటింటి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీల అమలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకుని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అభిప్రాయాలు తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, ఇది ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో బాలికల సంరక్షణ అధికారి ఆకస్మిక తనిఖీ



**ఉమ్మడి చిత్తూరు జిల్లా, పెన్ పవర్ ఆగస్టు 11**

అన్నమయ్య జిల్లా బాలికల సంరక్షణ అధికారి బి. సుమతి వగళ్ళ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని స్టోర్ రూమ్‌లో నిత్యావసర సరుకులను పరిశీలించి, బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన భోజనం అందించాలని వంట సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిశుభ్రతపై నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.ఆరవ తరగతి విద్యార్థినుల అభ్యసన స్థాయిని పరిశీలించిన ఆమె, తొమ్మిదో తరగతిలో నిర్వహిస్తున్న క్లిక్కర్స్ క్లాసులను కూడా పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, మానసిక ఒత్తిడిని అధిగమించే విధానాలపై సూచనలు అందించారు. అనంతరం విద్యార్థినులందరికీ పెన్నులను బహూకరించారు.పాఠశాల రికార్డులను తనిఖీ చేసిన సుమతి, పాఠశాల పరిశుభ్రతపై పీఈటీ, ఏఎన్ఎంలకు తగు సూచనలు చేశారు. జీఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా విద్యార్థినుల అభ్యసనను పరిశీలిస్తూ వారితో బోర్డుపై రాయించి చదివించారు. గ్రాండ్ టెస్ట్ మార్కుల ఆధారంగా ఉన్నతి, ప్రగతి, దీప్తి, స్ఫూర్తి వర్గాలుగా విభజించిన విద్యార్థినుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. గ్రాండ్ టెస్ట్-1, స్లిప్ టెస్ట్, డిక్టేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ రికార్డులతో పాటు విద్యార్థినుల నోట్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ కళాశాలలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్లు, పొదలను తొలగించాలని సూచించారు. ఇంటర్మీడియట్ భవనానికి సేఫ్టీ వాల్ నిర్మించాలని కోరగా, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నెట్ జీరో ఆడిట్‌పై ప్రతి విద్యార్థినికి అవగాహన కల్పించాలని సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. నెట్ జీరో ఆడిట్‌లో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థినులకు అప్పగించాలని తెలిపారు.పాఠశాలలో సమకూర్చిన మౌలిక వసతులు, నిరంతర అభ్యసన కార్యక్రమాలపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## భీమిలి డైట్ కళాశాల లో ఇంటిగ్రేటెడ్ ఆర్ట్ లెర్నింగ్ వర్క్ షాప్



**భీమిలి, పెన్ పవర్ ఆగస్టు 11**

భీమిలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బి సునీత అధ్యక్షతన ఇంటిగ్రేటెడ్ ఆర్ట్ లెర్నింగ్ పై డాక్టర్ సీతాపతి సోమవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ విద్యార్థినీ విద్యార్థులకు ఒరుగామి పద్ధతిని ఉపయోగించి విద్యాబోధన విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే వి ఏ కె విజువల్, ఆడిటరీ, కినెస్థెటిక్) విధానంలో విద్యా బోధన చేయడం ద్వారా పిల్లలను పాఠ్యాంశాలకు ఆకర్షితులను చేసే వివిధ పద్ధతులను వివరించారు. భీమిలి సాంస్కృతిక వేదిక సభ్యుడు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఎ రాంప్రసాద్ మనిషి జీవితంలో గురువు యొక్క విశిష్టతను తెలియజేస్తూ, భవిష్యత్తు లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టనున్న విద్యార్థినీ విద్యార్థులలో స్ఫూర్తి రగిలించారు. ఆద్యంతం ఆసక్తి కలిగించిన ఈ కార్యక్రమాన్ని భీమిలి సాంస్కృతిక వేదిక ఉపాధ్యక్షుడు జి సత్యనారాయణ, సభ్యులు ఆదిత్య ముమ్మిడిశెట్టి తమదైన శైలిలో ముందుకు నడిపించారు. ఈ కార్యక్రమంలో భీమిలి సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి మునుకుట్ల కోటయ్య, ముసునూరి సూర్య శ్రీనివాస్, కాళ్ళ సన్నీ, అడిదం కిషోర్, వడలి శ్రీనివాస్, గౌరీనాయుడు, డైట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# ద్విముఖ వ్యూహంతో ఎల్ నినో ఎదుర్కోవాలి

## - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**



ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేలా ద్విముఖ వ్యూహంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్ నినో వలన ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉంటాయని నిపుణులు చెప్తున్న నేపథ్యంలో వరి సాగు చేస్తున్న రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని చెప్పారు. తద్వారా వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చూడడంతో పాటు జిల్లా జీ.డీ.పీ., జీ.వీ.ఏ. తగ్గకుండా చూడవచ్చు అన్నారు. జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా 6700 లకు పైగా ఎకరాలను గుర్తించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు, వాటిలో అంతర పంటలను సాగు చేయడము ద్వారా ఏటా వస్తున్న ఆదాయానికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా సమావేశాలు నిర్వహించి ఈ విషయాలను తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. వారికి అవసరమైన విత్తనాలను అందజేయాలన్నారు. తక్కువ నీటి వినియోగంతో ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందించాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో తాగునీటి కోసం చెరువులను నింపేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చెరువులు, బోర్లు కింద సాగు చేయవద్దని రైతులకు చెప్పాలన్నారు. ఆయా బోర్లు ఉన్న ప్రాంతాలలో భూగర్భ నీటిమట్టం ఏ స్థాయిలో ఉన్నదో అంచనా వేయాలని అధికారులకు కలెక్టర్ చెప్పారు. చేపల వేట కోసం చెరువులలోని నీటిని విడుదల చేస్తే ఊరుకోబోమన్నారు. త్రాగునీటిని చేపల చెరువులకు మళ్ళించినా, అక్రమంగా సాగుకు వినియోగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. పశు గ్రాసానికి కూడా కొరత లేకుండా చూడాలని, పశుగ్రాసం క్రయవిక్రయాల కోసం సమన్వయం చేసేలా ప్రత్యేక మొబైల్ యాప్ ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయ సీజన్ ఊపందుకోనందున కూలీలకు వి.బి.జి.రాంజీ పథకం కింద ఉపాధి కల్పించాలని కలెక్టర్ చెప్పారు. ఎల్ నినో ప్రభావం జిల్లాపై పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జోసఫ్ కుమార్, జిల్లా పశు సంవర్ధక అధికారి రవికుమార్, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, ఆర్. డబ్ల్యు. ఎస్. ఎస్. ఈ. నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, ఆత్మ పి.డీ. రత్న మంజుల, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, భూగర్భ నీటి వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన నేతాజీ సుబ్బారెడ్డి



**సి.ఎస్.పురం,పెన్ పవర్, ఆగస్టు 11**

మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలను సందర్శించి, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతిపై చర్చించారు.ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సుమారు రూ.12 వేల విలువైన స్టడీ మెటీరియల్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ షరీఫ్ సమక్షంలో నెల్లూరు నేతాజీ విద్యాసంస్థల అధినేత, పూర్వ విద్యార్థి సుబ్బారెడ్డి పంపిణీ చేశారు ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, అభ్యసన పరిస్థితులు, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షరీఫ్, పూర్వ విద్యార్థులు ముత్యాల నారాయణరెడ్డి, తులాబందుల చలమయ్య నాయుడు , చిట్టిబోయిన మౌలాలి, గుంటిమడుగు కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ కొండయ్య, కమ్మనేతి వెంకటేశ్వర్లు, పిసిఎం కొండయ్య, లక్కీపోగు ఆంటోని, నేలటూరి వెంకటేశ్వరరెడ్డి, బస్వి హనుమంతరావు, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరులో ఆగస్టు 14న ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక తెలుగుదేశంపార్టీ కార్యాలయం

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**



గిద్దలూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపించే ఉద్దేశంతో ఆగస్టు 14, న గిద్దలూరులో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు , గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతులను స్వీకరించనున్నారుఈకార్యక్రమం పట్టణంలోని తిరుమల కన్వెన్షన్, ఫంక్షన్ హాలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలు, వినతిపత్రాలతో కార్యక్రమానికి హాజరై సంబంధిత అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకురావాలని కోరారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డోర్ టు డోర్ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమం

**ముమ్మిడివరం, పెన్ పవర్ ఆగస్టు 11**

నగర పంచాయతీ పరిధిలోని ముమ్మిడివరం, క్రాప చింతలపూడి టౌన్ 15 వ వార్డులో జరిగిన డోర్ టూ డోర్ కార్యక్రమంలో కూటమి 2ఏళ్ల అభివృద్ధి, సంక్షేమశీ,నమ్మకం కార్యక్రమంలో పాల్గొని కూటమి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి తో కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకురాలు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు, ముమ్మిడివరం టౌన్ టిడిపి అధ్యక్షులు కట్టా సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ మద్దాల మంగ సత్య కుమారి,నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు యాళ్ల ఉదయ్,టూన్ తెలుగు యువత అధ్యక్షులు కడలి నాగు,దాట్ల బాబు, మాజీ కౌన్సిలర్ విళ్ల వీరాస్వామి నాయుడు,సత్తి నూకరాజు, ముమ్మిడివరం టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి గోపి,15వ వార్డు గ్రామ కమిటీ అధ్యక్షులు ఏడిద శివ, రామాయణం పల్లంరాజు,



దొరబాబు, సానబోయిన లక్ష్మీనారాయణ, గోవ్వల శ్రీను ముమ్మిడివరం టౌన్ టిడిపి నాయకులు భీమవరపు శ్రీనివాస్, పాయసం చిన్ని , కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ - సీడీపీఓ సుధా

## ప్రీ స్కూల్స్‌లో పిల్లలకు విద్య బోధనే ముఖ్య లక్ష్యం





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 11**

సంతమాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సీడీపీఓ సుధా ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ రెండో సంవత్సరం కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 11 నుంచి 13వ తేదీ వరకు కొనసాగనుంది. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యా విధానంలో టీచర్ల నైపుణ్యాలు, మెలకువలను పునశ్చరణ చేయడంతో పాటు నవచేతన కార్యక్రమంపై అవగాహన కల్పించడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఆదర్శశిలలో భాగంగా ప్రీస్కూల్ విద్యకు సంబంధించిన ఐదు డొమైన్‌లు, వాటిలోని వివిధ నైపుణ్యాలు, దశలపై శిక్షణలో క్లుప్తంగా వివరించారు. ముఖ్యంగా బోధన--అభ్యసన సామగ్రి (టీఎల్ఎం)ను సమర్థవంతంగా వినియోగిస్తూ చిన్నారులకు ఆసక్తికరంగా, సులభంగా విద్యాబోధన చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు డీవీ కోటేశ్వరరావు, నాగ సుబ్బారావు, వీరాంజనేయులు, సూపర్‌వైజర్లు ఎం. సుష్మారాణి, జి. ప్రమీలతో పాటు మండలంలోని 70 మంది అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినీలకు జాతీయ ప్రతిభా ఉపకార వేతనం





**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 11**

నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న టీ.కావ్య, వి.హంసిని విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క విద్యార్థినికి ప్రతి సంవత్సరం రూ.12,500 చొప్పున ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు నాలుగు సంవత్సరాల్లో మొత్తం రూ.50 వేల ఉపకార వేతనం ప్రభుత్వం అందించనుంది. జాతీయ స్థాయి ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలినేని సుధారాణి, బోధన, బోధనేతర సిబ్బంది, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మక్కిన బ్రహ్మయ్య, కమిటీ సభ్యులు, రిటైర్డ్ ఎస్ఐ అట్లా మోహన్‌రెడ్డి, రంగస్థల నటుడు, పూర్వ విద్యార్థి అట్లా శ్రీనివాసరెడ్డి, కుర్ర అంజయ్య, గ్రామస్తులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు అభినందించారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయుల ఎన్ఓసీ, డీడీవో కోడ్ సమస్యలపై యూటీఎఫ్ మెమోరండం



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**

ఉపాధ్యాయుల ఎన్ఓసీ, డీడీవో కోడ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా విద్యాశాఖాధికారికి మెమోరండం సమర్పించారు. ఉపాధ్యాయులు విదేశాలకు వెళ్లేందుకు సంబంధిత డీడీవోల ద్వారా ఎన్ఓసీలను ఆన్లైన్లో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపుతున్నారు. అయితే సాంకేతిక కారణాల వల్ల వాటిని పై అధికారులకు పంపలేకపోతున్నందున పెండింగ్లో ఉంటున్నాయని నాయకులు తెలిపారు. దీనివల్ల సకాలంలో ఎన్ఓసీలు రాక వీసా దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అప్గ్రేడ్ అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఇప్పటివరకు డీడీవో కోడ్లు కేటాయించలేదని, వెంటనే వాటిని ఇవ్వాలని మెమోరండంలో కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ. విరారెడ్డి, కోశాధికారి బి. శ్రీరాములు, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు వై. పాపయ్య, పి. వెంకటేశ్వర్లు, ఎస్. వేణు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి టిడిపి కార్యక్రమం విజయవంతం

**టిడిపి శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపిన బొబ్బూరి రమేష్**

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 11**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని 43 పోలింగ్ బూత్ లలో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేసి అవగాహన కల్పించడంతో పాటు కార్యక్రమంలో ప్రజల వివరాలను నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని 43 పోలింగ్ కేంద్రాల్లో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో క్లస్టర్ ఇన్చార్జిలు, కో-క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, కో-యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు, కో-బూత్ కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేశారని విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు ఒంగోలులో అండర్ 19 బాల బాలికల రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలు - నిర్వాహకుల వెల్లడి

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**

ఈ నెల 12 బుధవారం నుండి యోనెక్స్ సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ 2026 రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల బాలికల జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో జరుగుతాయని ప్రకాశంజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మా రెడ్డి, కార్యదర్శి పి.విజయ కృష్ణా,లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఒంగోలు హైదరి క్లబ్ లో జరిగిన ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఈ మేరకు పోటీల నిర్వహణ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మా రెడ్డి,కార్యదర్శి పి.విజయ కృష్ణా తెలిపారు. లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా బుధవారం నుండి అండర్ 19 బాల బాలికలు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్నట్టు తెలిపారు. ఇందుకుగాను. ఈనెల 12 బుధవారం క్వాలిఫైయింగ్ మ్యాచులు, 13 నుంచి మెయిన్ డ్రా, 16న ఫైనల్ పోటీలు జరుగుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజులు జరిగే పోటీలలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మరియు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఇ.సి.మెంబర్ ఎమ్. రఘుబాబు పోటీలకు ఆర్గనై జింగ్ సెక్రటరీ గా వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవు వుతారని తెలిపారు.



# ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమం

### అశోకుడి కి అడుగడుగున నీరాజనాలు -పులవర్షం కురిపించిన ప్రజలు

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**

గిద్దలూరు పట్టణంలోని 16 వ వార్డు కొండపేట గ్రామంలో " ఇంటింటికీ కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు " కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మంగళ వారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వార్డు నాయకులు , ప్రజలు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు వార్డు లోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం , గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం వార్డు



నాయకులు, మహిళలు ప్రజలు " ఎమ్మెల్యేను శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. అశోక్ రెడ్డి కొండపేట గ్రామం చేరుకోగానే టిడిపి శ్రేణులు , అభిమానులు, ప్రజలు పులవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు కూటమి ప్రభుత్వ అనుకూల నినాదాలు చేశారు.



చంద్రన్న, పవనన్న, లోకేష్ , అశోక్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో గ్రామం, మారుమ్రోగింది. ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన జిల్లాలో తొలిసారి ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు: కలెక్టర్ విజయ సునీత




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 11**

నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రంలో తొలిసారిగా నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలందరికీ మధుర స్మృతిగా నిలిచేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఎస్వీకేపి కళాశాల మైదానంలో జరిగే జిల్లా స్థాయి వేడుకలకు జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో వస్తారని, ఎలాంటి అసౌకర్యం లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. క్రౌడ్, ట్రాఫిక్ మేనేజ్మెంట్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్, వీఐపీ, మీడియా, సాధారణ ప్రజలకు ప్రత్యేక సీటింగ్ ప్రాంగణాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్యం, తాత్కాలిక శౌచాలయాలు, ఎండ దెబ్బ తగలకుండా నీడ సౌకర్యం, విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ పక్కాగా ఉండాలని, ప్రాంగణ డెకరేషన్ ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. వినూత్న శకటాల ప్రదర్శన, ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాళ్ల ఏర్పాటు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వినూత్నంగా ఉండాలని తెలిపారు. అలాగే కార్యక్రమాల నిర్వహణలో అధికారులు ఖచ్చితమైన సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధిపై సమీక్షిస్తూ, త్వరలోనే వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించనున్నామని కలెక్టర్ ప్రకటించారు. ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం ఆర్అండ్ఆర్ కు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి అన్ని వసతులు ఎటువంటి లోపాలు లేకుండా కల్పించాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీని మరింత వేగవంతంగా, లబ్ధిదారులకు సకాలంలో అందేలా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలందరూ ఈ చారిత్రాత్మక వేడుకల్లో విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, డీఈఓ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నేర నియంత్రణ రోడ్డు భద్రతలపై ప్రజలు బాధ్యతగా మెలగాలి

### ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి - ఎస్సై వై నాగరాజు

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 11**

దర్శి డీఎస్పీ బాల మురళీకృష్ణ, సంతమాగులూరు సీఐ పి. శేషగిరిరావు సూచనల మేరకు నేర నియంత్రణ, రోడ్డు భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు బల్లికురవ ఎస్సై వై. నాగరాజు తెలిపారు. బల్లికురవ కూడలిలో మంగళవారం సాయంత్రం 'నేర నియంత్రణ--ప్రజల భాగస్వామ్యం' అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బల్లికురవ ప్రాంతంలో గ్రానైట్ క్వారీలు, గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు అధికంగా ఉన్న నేపథ్యంలో అక్కడ పనిచేసే కార్మికులు, వాహనదారులు తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించాలని తెలిపారు. భారీ వాహనాల రాకపోకలు, గ్రానైట్ రాళ్ల రవాణా కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ఇదిలా ఉండగా బల్లికురవ కూడలిలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్న విషయాన్ని ఎస్సై నాగరాజు స్వయంగా పరిశీలించారు.



రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా నిలపడం, భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్కు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత ఏఎన్ఆర్ ఉన్నత పర్యవేక్షకులతో మాట్లాడి నాలుగు రోజుల్లోగా కూడలి నుంచి చెక్పోస్టులను మార్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తోడ్పడాలని, ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలు, రోడ్డు ప్రమాదాలను మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని ఎస్సై నాగరాజు పేర్కొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు వరం..

### తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ -వాహన సేవలు ప్రారంభించిన డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**

ప్రతి గర్భిణీ స్త్రీ కి సురక్షితం ప్రతి శిశువుకు ఆరోగ్యం కోసం ప్రకాశం జిల్లా ప్రజలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను ఉపయోగించుకోవాలని ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకాశం జిల్లాకు 7 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను మంజూరు చేయడం జరిగింది. మంగళవారం నుండి తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు నేటి నుండి అధికారికంగా సేవలోకి ప్రవేశించాయని, ముఖ్యంగా గర్భిణీలు ప్రసూతులు బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన ఉచిత రవాణా సేవలు అందించడం అని తెలిపారు. ఈ ఏడు వాహనాలు జిల్లాలోని వివిధ మండలాల్లో పిహెచ్ సి, సిహెచ్సి, జిల్లా ఆస్పత్రికి పంపించడానికి అందుబాటులో ఉంటూ 24 గంటలు సేవలు అందిస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో 102 తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ నెంబర్ కు కాల్ చేసిన వెంటనే సమీప వాహనము చేరుకొని రోగిని సకాలంలో వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ సేవల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు దూర ప్రాంతాలకు చెందిన గర్భిణీ స్త్రీలు అత్యవసర



ప్రసవాలు బాలింతలు నవజాత శిశువులు , సురక్షిత వైద్యం పొందగలరని తెలిపారు. జిల్లాలోని ప్రజలను 102 వాహనాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

## జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

**జి జి హెచ్ ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో జూనియర్ డాక్టర్ల నిరసన**

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 11**

జూనియర్ డాక్టర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జూనియర్ డాక్టర్ల సంఘ నాయకులు డాక్టర్ సత్యదీప్ అన్నారు. మంగళవారం జూనియర్ డాక్టర్లు జిజిహెచ్ ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. జూనియర్ డాక్టర్లు గత డిసెంబరులో ఆగిపోయిన స్టైఫండ్ విధానాన్ని మరల పునరుద్ధరించాలని ఈ సంవత్సరం జనవరి నుంచి అనేకసార్లు అధికారులకు అర్జీలు రూపంలో ఇచ్చినప్పటికీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని అందువలన రాష్ట్రవ్యాప్త జూనియర్ డాక్టర్ల సమ్మె లో భాగంగా నేటి నుండి దశలవారీగా ఆందోళనలు చేపట్టి సమస్య పరిష్కారం కాకపోతే 17 తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు సరిగా లేని కారణంగా వైద్య సేవలు అందించలేకపోతున్నామని అందువలన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న డాక్టర్లకు వయోపరిమితి 62 నుంచి 65 సంవత్సరాలు పెంపు వలన మెడిసిన్ పూర్తిచేసి బయటకు వస్తున్న మేడికోలకు ఉద్యోగాలు రావని అందువలన వయోపరిమితి పెంచరాదని అన్నారు. వీటితో పాటుగా అనేక సమస్యలు ఉన్నాయని ఆ సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న న్యాయమైన కార్యక్రమాలకు మద్దతు పలకాలని వారు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ ఫైజా పఠాన్, డాక్టర్ కృషి కాంత్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

## క్రైస్తవ భూములను అక్రమాలు అరికట్టాలి



**దొనకొండ ఆగస్టు 11 పెన్ పవర్ :**

క్రైస్తవ భూములను అక్రమ పలు నిర్మాణాలను వెంటనే అరికట్టి సిఎస్ నెంబర్ 124/94 మద్రాస్ హైకోర్టు తీర్పును గౌరవించాలి. దొనకొండ ఏబీఎన్ బేతేలు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ భూముల్లో జరుగుతున్న అక్రమ అక్రమనలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. క్రైస్తవ భూములు చర్చి ఆస్తులను పరిరక్షించేందుకు ప్రభుత్వ మరియు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. చర్చి ఆస్తులపై అక్రమ నిర్మాణాలు అక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. చర్చి ఆస్తుల పరిరక్షణకు సంబంధించి న్యాయస్థానాల్లో ఉన్న కేసులు ఉత్తర్వులను అధికారులు పరిగణలోకి తీసుకొని తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు. క్రైస్తవ భూములు పరిరక్షణకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘ సెక్రటరీ ఎం సుధీర్, గుంటు జాకబ్ ఈ కార్యక్రమంలో జి ఆశీర్వాదం ఎన్ జాన్ వై నాగరాజు కే మదన్ ఎం కొండయ్య ఎం రవి కె మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జ్ఞానజ్యోతి శిక్షణ

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 11**

గిద్దలూరు ఐసీడిఎస్ ప్రాజెక్ట్ గిద్దలూరు పరిధిలో ని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మూడు మండలాలలో ని అంగన్వాడీ కార్యకర్తలుకు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిలు గా గిద్దలూరు ఎంఇఓ 1&2 పాల్గొని జ్యోతి ప్రజ్వల న చేశారు . ఈ శిక్షణ తరగతులు 11-13 వరకు మరియు 22,24,25 వరకు 6 రోజులు నిర్వహించబడునని తెలియజేశారు. ఈ ట్రైనింగ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం 3-6 సంవత్సరాల పిల్లలలో సర్వతో ముఖాభి వృద్ధి కి ఎంత గానో ఉపయోగ పడుతుందని తెలియజేశారు. నావచేతన, ఆదర్శిలా ద్వారా పిల్లలోఈ ఎలా అభివృద్ధి జరుగుతుందో ఈ ట్రైనింగ్స్ ద్వారా తెలియజేస్తున్నారు .ఈ కార్యక్రమం లో ఎంఇఓ1&2 నాగభూషన్ రెడ్డి, అశ్విని కుమార్ , డి ఆర్ పి లు రాజగోపాల్ రెడ్డి, బాలరంగయ్య, రంగనాయకులు, సాధిఖ్, సీడీపీఓ మహిత పాల్గొన్నారు. గిద్దలూరు మండలం అంగన్వాడీ టీచర్స్ అందరు ట్రైనింగ్ లో పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com